Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...

నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

మంగళవారం 22/09/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్

## పౌరసత్వం కేసులో దర్యాప్తునకు ఆదేశాలు




**టీ మీడియా ,సెప్టెంబర్ 21, ఢిల్లీ బ్యూరో :**
కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందేందుకు మూడేళ్ల ముందే సోనియా గాంధీ పేరును ఓటర్ల జాబితాలో చేర్చారన్న ఆరోపణపై విచారణకు నిరాకరిస్తూ గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను అనుమతించింది. ఈ పిటిషన్?ను తిరిగి విచారణ చేపట్టాలంటూ ఢిల్లీ కోర్టు సోమవారం ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వును సరైన వివరణ లేనిదిగా పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దానిని కొట్టివేశారు. రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ ఢిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అడ్వకేట్ వికాస్ త్రిపాఠి ఈ పిటిషన్?ను దాఖలు చేశారు. (మిగతా 2లో)

# ఎల్‌నినోతో వర్షపాతంలో తీవ్ర లోటు



### ⏭ మరోవైపు అధిక ఉష్ణోగ్రతలు

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, హైదరాబాద్ బ్యూరో :**
'సూపర్ ఎల్?నినో' ప్రభావం వల్ల ఖరీఫ్ సీజన్ తీవ్రంగా దెబ్బతింది. సాధారణ స్థాయిలతో పోలిస్తే రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 21 లక్షల ఎకరాల మేర తగ్గింది. అడపాదడపా కురిసిన వర్షాల సమయంలో వేసిన పంటలు తీవ్రమైన ఎండల కారణంగా వాడిపోయాయి. పత్తి, కంది పంటల విషయంలో రైతులు ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సాగునీటి వ్యవస్థలు, చెరువుల ఆఖరి భాగంలో ఉన్న పొలాలకు నీరు అందకపోవడంతో వరి పంటలు కూడా ఎండిపోతున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 497 మండలాల్లో వర్షపాతం లోపం నమోదు కాగా 125 మండలాలు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. కేవలం 66 మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా 11 జిల్లాల్లోని ఏ ఒక్క మండలంలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కొంత ఉపశమనాన్ని ఇస్తాయని రైతులు ఆశిస్తున్నారు. తక్కువ వర్షపాతం, తీవ్రమైన ఎండల కలయిక వల్ల, చాలా వరకు పంటలు ఇప్పటికే వాడిపోవడం ప్రారంభించాయి. దీనివల్ల పెట్టిన పెట్టుబడిని తిరిగి పొందే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి.

**వ్యాపక పంట నష్టం**

రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పంటలు సాగు చేశారు. ఇందులో వరి సాగు 31 లక్షల ఎకరాల్లో జరిగింది. గోదావరి డెల్టా, కృష్ణా డెల్టాలోని కొన్ని ప్రాంతాల్లో సాగు జరిగింది. కృష్ణా డెల్టాలో సాగుకు పట్టిసీమ ప్రాజెక్ట్ నుంచి నీరు లభించింది. సాధారణ సాగు విస్తీర్ణంలో కేవలం 84% మేర మాత్రమే వరి నాట్లు పడ్డాయి. ఈ విస్తీర్ణంలో కూడా నీటి కొరత కారణంగా ఆఖరి భాగంలో ఉన్న పొలాల్లో నేల బీటలు వారింది. ఇటీవలి వర్షాలు కొంత ఊరటనిచ్చినప్పటికీ పంట కోత దశ వరకు నీటి సరఫరా కొనసాగితే తప్ప మంచి దిగుబడి సాధించడం అనిశ్చితిగానే ఉంది.

కృష్ణా నదికి నీటి ప్రవాహం లేకపోవడం వల్ల, నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో వరి నాట్లు వేయలేదు. సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే, పల్నాడు జిల్లాలో 29% ప్రకాశం జిల్లాలో 30% విస్తీర్ణంలో మాత్రమే వరి సాగు జరిగింది. రాయలసీమ జిల్లాల్లో కూడా వరి సాగు గణనీయంగా తగ్గింది. బోరుబావులు ఎండిపోవడంతో కొన్ని చోట్ల వరి నారు వాడిపోతోంది.

10 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేసినప్పటికీ, మొక్కలు సరిగ్గా పెరగలేదు. అవి కేవలం ఒకటి నుంచి ఒకటిన్నర అడుగుల ఎత్తులోనే ఆగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో పంట పూర్తిగా ఎండిపోయింది. ఇటీవలి వర్షాలు పత్తి దిగుబడిపై రైతుల్లో కొంత ఆశను కలిగించాయి. దాంతో వారు ఇప్పుడు ఎరువులు వేస్తున్నారు. అయితే వర్షాలు మళ్లీ కురవకపోతే వారు తమ పెట్టుబడిని కోల్పోయే ప్రమాదం ఉంది. కందులు సాగు చేసిన 7.13 లక్షల ఎకరాలలో, 90% పంట ఎండిపోయింది. ప్రస్తుత వర్షాలు కురిసినప్పటికీ పంట చేతికి వచ్చే అవకాశం తక్కువగానే ఉంది.

రైతులు నర్సరీలలో మిరప నారును పెంచి నాటారు. నాటడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని కూడా తరలించారు. కానీ తీవ్రమైన ఎండల వల్ల మొక్కలు ఎండిపోతున్నాయి. దీనివల్ల రైతులు కొత్త నారును తెచ్చి నాటాల్సి వస్తోంది. ఇటీవలి వర్షాలు కొంత అనుకూల పరిస్థితులను కల్పించినప్పటికీ, సాగునీటి ప్రాజెక్టులలోకి నీటి ప్రవాహం లేకపోవడంతో మిరప సాగుకు నీటిని ఎక్కడి నుంచి సమకూర్చుకోవాలనే ప్రశ్న రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

**ఉద్యాన పంటలకు క్లిష్ట సమయం**

రాష్ట్రవ్యాప్తంగా 8.91 లక్షల హెక్టార్లలో సాగు చేసిన ఉద్యాన పంటల పరిస్థితి అనిశ్చితంగా ఉంది. అనేక ప్రాంతాల్లోని తోటలు ఇప్పటికే ఎండిపోవడం ప్రారంభించాయి. వాటిని కాపాడుకోవడానికి రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నప్పటికీ, ఫలితాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఈ పంటలకు సాగునీటి సదుపాయం కల్పించడానికి ప్రభుత్వం రూ.190.70 కోట్లు కేటాయించింది. మామిడి తోటలకు రక్షణ నీటి తడులు అందించడానికి అత్యధికంగా రూ. 99.78 కోట్లు అవసరమవుతాయని అంచనా.

**21.28 లక్షల ఎకరాలు సాగుకు నోచుకోలేదు**

రాష్ట్రవ్యాప్తంగా 21.28 లక్షల ఎకరాల సాగుయోగ్యమైన భూమి ఖాళీగా ఉండిపోయింది. వర్షాలు కురిస్తే, ఈ భూముల్లో ప్రత్యామ్నాయ పంటలను వేయాల్సి ఉంటుంది. దీనికి అనుకూలంగా రాయితీ ధరలకు విత్తనాలను అందించడానికి (మిగతా 2లో)

# పిఠాపురంలో పవన్ పర్యటన



### ⏭ ప్రారంభోత్సవాలతో బిజీబిజీ

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, కాకినాడ :**
కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించారు. ఎఫ్?కే పాలెంలో డిప్యూటీ సీఎంకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. తొలుత మైసమ్మ ఆలయాన్ని సందర్శించిన ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మైసమ్మ చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. చెరువు అభివృద్ధికి ముందు, తర్వాత ఉన్న పరిస్థితుల్లో వ్యత్యాసాన్ని అధికారులు వివరించారు.ఆధునీకరించిన మైసమ్మ చెరువును పవన్ కల్యాణ్ ప్రారంభించారు. చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌తోపాటు ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. గట్టుపై నడుస్తూ గ్రామస్థులకు అభివాదం చేశారు. ఎఫ్?కే పాలెంలో సైడ్ కాల్వలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం, విలేజ్ క్లినిక్‌ను సందర్శించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరును పరిశీలించారు. మైసమ్మ చెరువు నుంచి ఎఫ్‌కే పాలెం (మిగతా 2లో)

# ఎస్బీఐ పట్ల పెరుగుతున్న విముఖత




### ⏭ చక్కదిద్దేపనిలో బ్యాంకు

**టీ మీడియా ,సెప్టెంబర్ 21,బిజినెస్ బ్యూరో:**
భారతదేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ( ప్రస్తుతం ఒక వినూత్న సవాలును ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో ఖాతాదారుల నమ్మకాన్ని గెలుచుకున్న ఈ సంస్థ పట్ల, ఇటీవలి కాలంలో వినియోగదారులలో కొంత విముఖత మరియు అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తోంది. సాంకేతిక లోపాలు, సేవలలో ఆలస్యం మరియు ప్రైవేట్ బ్యాంకుల నుండి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ కారణంగా ఎస్బీఐ తన సాంప్రదాయ కస్టమర్ బేస్‌ను కాపాడుకోవడానికి కష్టపడాల్సి వస్తోంది. అయితే, పోగొట్టుకున్న ప్రజాదరణను తిరిగి దక్కించుకోవడానికి మరియు ఖాతాదారుల అభిమానాన్ని చూరగొనడానికి ఎస్బీఐ యాజమాన్యం ఇప్పుడు యుద్ధప్రాతిపదికన పలు సంస్కరణలు మరియు విప్లవాత్మక చర్యలకు శ్రీకారం చుట్టింది.

**విముఖత రావడానికి కారణాలు**

ఎస్బీఐ సేవలపై వినియోగదారులు ప్రధానంగా కొన్ని అంశాలలో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అందులో మొదటిది డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థలో తరచూ తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు. యోనో యాప్ , నెట్ బ్యాంకింగ్ సర్వర్లు కొన్ని కీలక సమయాల్లో డౌన్ అవ్వడం వల్ల ఆన్‌లైన్ లావాదేవీలు నిలిచిపోయి వ్యాపారస్తులు, సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. రెండవది, బ్రాంచ్‌లలో కస్టమర్ సర్వీస్ వేగం మందగించడం. ప్రైవేట్ బ్యాంకులతో పోలిస్తే ఎస్బీఐ శాఖలలో ఇప్పటికీ చిన్న పనులకు కూడా గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందనే విమర్శలు ఉన్నాయి. వీటికి తోడు, కనీస బ్యాలెన్స్ నిర్వహించనందుకు విధించే పెనాల్టీలు మరియు వివిధ రకాల సేవా రుసుములు పెంచడం కూడా మధ్యతరగతి ఖాతాదారులలో అసంతృప్తిని పెంచింది.

**వినియోగదారుల ట్రెండ్ మార్పులు**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఎస్బీఐకి గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో బలమైన నెట్‌వర్క్ ఉంది. అయితే, ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల్లోని యువత మరియు ఐటీ ఉద్యోగులు డిజిటల్ సేవలు వేగంగా అందించే ప్రైవేట్ బ్యాంకుల వైపు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ రుణాలు, పింఛన్ల పంపిణీ వంటి ప్రభుత్వ పథకాలకు ఎస్బీఐ ఇప్పటికీ కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నప్పటికీ, సాధారణ సేవింగ్స్ ఖాతాదారులు మాత్రం ప్రైవేట్ సంస్థల వైపు మళ్లుతున్నారు. దీనిని గమనించిన స్థానిక ఎస్బీఐ అధికారులు ఖాతాదారుల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కస్టమర్ కేర్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు.

**ప్రజల అభిమానం చూరగొనడానికి**

టెక్నాలజీ అప్‌గ్రేడేషన్: సర్వర్ డౌన్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎస్బీఐ తన ఐటీ మౌలిక సదుపాయాలను సరికొత్త క్లౌడ్ టెక్నాలజీతో ఆధునీకరిస్తోంది. 'యోనో 2.0' వెర్షన్‌ను మరింత సులభంగా, వేగంగా లావాదేవీలు జరిగేలా రీడిజైన్ చేస్తున్నారు.
కస్టమర్ ఫ్రెండ్లీ బ్యాంకింగ్రాం చ్‌లలో రద్దీని తగ్గించేందుకు డిజిటల్ కౌంటర్లను పెంచడంతో (మిగతా 2లో)

# సీఎంఆర్‌పై డిజిటల్ కన్ను

**● ప్రతి బుధవారం సడెన్ చెక్**

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, హైదరాబాద్ :**
రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, ప్రభుత్వానికి అందాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీలపై నిఘా మరింత పెరగనుంది. సీఎంఆర్ వ్యవస్థలో అక్రమాలు, స్టాక్ గోల్‌మాల్‌కు అడ్డుకట్ట వేసేందుకు సివిల్ సప్లయ్స్ శాఖ కొత్త డిజిటల్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఫిజికల్ వెరిఫికేషన్ (గ్రాఎ) యాప్ను అందుబాటులోకి తెచ్చింది.ఈ యాప్ ద్వారా మిల్లుకు కేటాయించిన ధాన్యం నుంచి మిల్లింగ్, బియ్యం నిల్వలు, ప్రభుత్వానికి చేసిన డెలివరీ వరకు వివరాలను డిజిటల్‌గా ట్రాక్ చేయనున్నారు. ముఖ్యంగా తనిఖీల కోసం ర్యాండమైజేషన్ విధానాన్ని అమలు చేయడం ఈ వ్యవస్థలో కీలక అంశంగా మారింది.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి బుధవారం రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. ఏ అధికారి ఏ మిల్లుకు వెళ్లాలన్నది ముందుగానే నిర్ణయించకుండా గ్రాఎ యాప్ ద్వారా ర్యాండమ్‌గా కేటాయిస్తారు. తనిఖీకి వెళ్లే అధికారికి సుమారు 12 గంటల ముందు లేదా ఒక రోజు ముందు సమాచారం అందుతుంది. దీంతో ముందుగానే సమాచారం తెలుసుకుని స్టాక్‌ను మార్చడం లేదా రికార్డులను సర్దుబాటు చేయడం వంటి అవకాశాలను తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.తనిఖీ సమయంలో యాప్‌లో నమోదైన వివరాలను




మిల్లులోని వాస్తవ నిల్వలతో అధికారులు పోల్చి చూస్తారు. కేటాయించిన ధాన్యం ఎంత? ఎంత మిల్లింగ్ చేశారు? ప్రభుత్వానికి ఎంత బియ్యం ఇచ్చారు? ఇంకా ఎంత ఇవ్వాలి? ప్రస్తుతం మిల్లులో ఉండాల్సిన స్టాక్ ఎంత? వంటి వివరాలను పరిశీలిస్తారు. లెక్కల్లో తేడాలు కనిపిస్తే వాటిని యాప్‌లోనే నమోదు చేసి, అవసరమైతే పంచనామా నిర్వహించి సంబంధిత నివేదికను డిజిటల్‌గా అప్‌లోడ్ చేస్తారు.ఈ వ్యవస్థ ద్వారా మిల్లర్లతో పాటు తనిఖీలు నిర్వహించే అధికారుల పనితీరుపైనా పర్యవేక్షణ ఉండనుంది. క్షేత్రస్థాయి అధికారులు నమోదు చేసిన వివరాలను ఉన్నతాధికారులు, జాయింట్ కలెక్టర్లు, హెడ్ ఆఫీస్ బృందాలు పరిశీలించే అవకాశం ఉంటుంది. గత సీజన్లలోబియ్యం డెలివరీలో వెనుకబడిన మిల్లర్లపైనా ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. పెండింగ్ స్టాక్, బకాయిలు, డెలివరీ వివరాలను యాప్‌లో ట్రాక్ చేయడం ద్వారా డిఫాల్ట్ మిల్లర్లపై పర్యవేక్షణ పెంచనున్నారు.మొత్తంగా ర్యాండమ్ తనిఖీలు, డిజిటల్ రికార్డులు, ఫిజికల్ స్టాక్‌తో పోలిక, ఉన్నతస్థాయి క్రాస్‌చెకింగ్ ద్వారా సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత పెంచాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానం క్షేత్రస్థాయిలో ఎంత సమర్థంగా అమలవుతుందన్నదే కీలకంగా మారనుంది.

# కారేపల్లి శివాలయం గణేష్ మండపం వద్ద అన్నదానం



**టీ మీడియా,సెప్టెంబర్21,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా కారేపల్లి శివాలయం లోని గణేష్ మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ),కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

**రూ.31 వేలు పలికిన గణేష్ లడ్డు**

పాత శివాలయం గణేష్ మండపం వద్ద నిర్వహించిన లడ్డు వేలంపాటలో గణేష్ లడ్డును పరిటాల మధు రూ.31 వేలకు దక్కించుకున్నారు.నిమజ్జనం సమీపిస్తుండటంతో మండపాల వద్ద లడ్డూలు,పూజా సామగ్రి వేలంపాటలు సందడిగా కొనసాగుతున్నాయి.

# 22ఏలో 3 వేల ఎకరాలు



**● రైతు సంఘం నేత బొంతు రాంబాబు**

**టీ మీడియా,సెప్టెంబర్21,సింగరేణి(కారేపల్లి):**
పేద రైతులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములు 22ఏ నిషేధిత జాబితాలో ఉండటంతో భూమిపై హక్కులు పొందలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు.సింగరేణి మండలంలో సుమారు 3 వేల ఎకరాల సాగు భూములు 22ఏ జాబితాలో ఉన్నాయని,వాటిని తక్షణమే జాబితా నుంచి తొలగించి రైతులకు అన్ని హక్కులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రైతు సంఘం బృందం సోమవారం కారేపల్లి మండలంలో 22ఏ జాబితాలో భూములు ఉన్న రైతులతో సమావేశాలు నిర్వహించింది.రైతులు సాగు చేస్తున్న భూముల సర్వే నంబర్లు,విస్తీర్ణం,నిషేధిత జాబితా కారణంగా ఎదుర్కొంటున్న సమస్యల వివరాలను సేకరించింది.ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం ధరణి పేరుతో వేలాది ఎకరాల సాగు భూములను పార్ట్–2లో ఉంచిందని,ప్రస్తుత ప్రభుత్వం భూ భారతి అమలులోనూ 22ఏ జాబితా పేరుతో రైతుల భూములపై హక్కులకు ఆటంకాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. రైతుల సాగులో ఉన్న భూములను గుర్తించాలని రాంబాబు డిమాండ్ చేశారు.అర్హమైన సాగు భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి బ్యాంకు రుణాలు,వారసత్వ బదిలీతో పాటు రైతులకు ఉండాల్సిన అన్ని హక్కులను పునరుద్ధరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ,కారేపల్లి మండల కార్యదర్శి వజ్జా రామారావు,సీఐటీయూ జిల్లా నాయకులు కుందనపల్లి నరేంద్ర,మాజీ సర్పంచ్‌లు భూక్యా రమణ,బానోతు సక్రామ్, రైతులు పిప్పల కృష్ణ,గణితి సత్యనారాయణ,తారాచంద్,బుడిగ రాజయ్య,శోభన్,భద్రయ్య,నరసింహారావు,వెంకన్న ,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సాగుకు నీళ్లిస్తే.. తాగునీటి పరిస్థితి ఏంటి?

**● మంత్రి జూపల్లి కృష్ణారావు**

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, హైదరాబాద్:**
నీటి ప్రాజెక్టుల్లోకి ఒక్క చుక్క నీరు కూడా రావట్లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. సాగుకు నీరు వదిలేస్తే.. తాగు నీటి పరిస్థితి ఏంటి? అని మంత్రి ప్రశ్నించారు. జూరాల వద్ద ఎందుకు అదనంగా రిజర్వాయర్ నిర్మాణం ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి ఎర్రవల్లికి నీళ్లు వస్తున్నాయన్న మంత్రి జూపల్లి జూరాల వద్ద 21 టీఎంసీల గట్టు నిర్మిస్తామన్నారు.. ఒక్క టీఎంసీ గట్టు కూడా నిర్మించలేదని మండిపడ్డారు.జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి కారణం బీఆర్ఎస్సేనని ఆరోపించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఒక్క రిజర్వాయర్ కూడా నిర్మించలేదని విమర్శించారు. ఆరోజు రిజర్వాయర్ నిర్మించి ఉంటే ఈనాడు ఇబ్బంది ఉండేది కాదన్నారు. జూరాల ఆయకట్టుకు నీటి ఎద్దడి ఉన్నది వాస్తవమని మంత్రి స్పష్టం చేశారు. ఎల్ నినో వల్ల ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రైతులకు చెప్పినట్లు మంత్రి గుర్తుచేశారు. నీటి విడుదల కోసం కర్ణాటక ప్రభుత్వంతో కూడా మాట్లాడుతున్నామని సూచించారు. కృష్ణా జలాలను ఏపీ ఎక్కువగా వాడుకుంటుందని కేసీఆర్ అంటున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే కృష్ణా జలాలను ఏపీ ఎక్కువగా వాడుకుందని జూపల్లి ఆరోపించారు. ఇరిగేషన్ పై అవగాహన ఉండే



కేటీఆర్మాట్లాడుతున్నారా? ఐదు మోటర్లు ఉంటే మూడే నడిపించారని ఆరోపించారు. రైతులకు 6 గంటలకు మించి కరెంట్ ఇవ్వట్లేదని మాట్లాడుతున్నారని, గతంలో లాగ్ బుక్ లు కూడా చూడనివ్వలేదని ఎద్దేవా చేశారు. డిసెంబర్ లో 19,542 మెగా వాట్ల విద్యుత్ వినియోగం జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో 15 వేల మెగా వాట్లే విద్యుత్ ఉపయోగించారని వివరించారు. విద్యుత్ సంస్థలపై రూ. లక్ష కోట్ల బకాయిలు ఉన్నాయని జూపల్లి లెక్కచెప్పారు

# వేధింపుల కేసులో 3 సంవత్సరాల జైలు శిక్ష

**టీ మీడియా ,సెప్టెంబర్ 21,ముదిగొండ:**
వరకట్న వేధింపుల కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ ఖమ్మం 2వ అదనపుకోర్టు గౌరవ న్యాయమూర్తి వై. బిందుప్రియ తీర్పు చెప్పారు.ముదిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన , వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద కేసు నమోదు చేసిన ఈ కేసులో మదినేని బోసుబాబు, (40 సం) పాత కాచారం గ్రామం, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా నివాసి, నిందితుడు–1గా ఉన్నారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కోర్టు 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష మరియు రూ.5,000 జరిమానా విధించింది.ఈ కేసులో దర్యాప్తు అధికారిగా అప్పటి ఎస్సై ఎం.డి. మౌలానా, బ్రీఫింగ్ అధికారి ప్రస్తుత ముదిగొండ పోలీస్ స్టేషన్ సిఐ మురళి వ్యవహరించారు.కేసు దర్యాప్తు, కోర్టు విచారణ ప్రక్రియలో ఆప్రా గాయత్రి, జఖా సిహెచ్. శ్రవణ్, ప్రాసెస్ సిబ్బంది లైజన్ అధికారులు కె. శ్రీకాంత్, ఎస్ఐ, డి. నాగేశ్వరరావు,హోంగార్డ్ ఎం. కాంతారావు లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# పిఠాపురంలో పవన్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)
సెంటర్ వరకు నడుచుకుంటూ వెళ్లిన పవన్ మార్గం మధ్యలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. చిన్నారులను ముద్దాడుతూ వారితో మమేకమయ్యారు.ఎఫ్?కేపాలెం నుంచి పీఠికావనం వరకు ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లిన పవన్ పిఠాపురంలో రూ.1.83 కోట్లతో నిర్మించిన పీఠికాపుర వనాన్ని ప్రారంభించారు. పీఠికాపుర వనంలో మొక్కలు, బటర్ ఫ్లై పార్క్, చిల్డ్రన్స్ పార్కును పరిశీలించారు. పీఠికాపుర వనంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్

(మొదటి పేజీ తరువాయి)

**అసలు ఈ కేసు ఏంటంటే?**

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 1983లో భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్? కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గతంలో బీజేపీ నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా పేరును చేర్చారని అందులో పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని చెప్పారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని రాసుకొచ్చారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని ఆరోపించారు. రాజీవ్‌ను వివాహమాడిన తర్వాత పౌరసత్వం రావడానికి 15 ఏళ్లు ఎందుకు పట్టిందని ఇక్కడ ప్రశ్నించడం లేదు. ముందే ఓటర్ జాబితాలో ఆమె పేరు కనిపించడం ఎన్నికల ప్రక్రియ దుర్వినియోగం కాకపోతే ఇంకేంటి?" అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.

# ఎస్బీఐ పట్ల పెరుగుతున్న విముఖత

(మొదటి పేజీ తరువాయి)
పాటు, సీనియర్ సిటిజన్లు మరియు మహిళల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఉద్యోగుల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి కస్టమర్ రిలేషన్స్ శిక్షణ ఇస్తున్నారు.సామాన్యులకు భారం కాకుండా ఉండేందుకు కనీస బ్యాలెన్స్ పరిమితులు మరియు ఇతర పెనాల్టీలపై రిలాక్సేషన్ ఇచ్చే దిశగా బ్యాంక్ బోర్డు కసరత్తు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో జీరో బ్యాలెన్స్ ఖాతాలను మరింత ప్రోత్సహిస్తోంది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో తన అగ్రస్థానాన్ని కాపాడుకోవడంతో పాటు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ఎస్బీఐ తీసుకుంటున్న ఈ సరికొత్త రక్షణ చర్యలు రాబోయే రోజుల్లో ఎలాంటి ఫలితాలను ఇస్తాయో వేచి చూడాలి.

# ఎల్‌నినోతో వర్షపాతంలో తీవ్ర లోటు

(మొదటి పేజీ తరువాయి)
ప్రభుత్వం ఇటీవల అదనంగా రూ. 90 కోట్ల బడ్జెట్‌ను మంజూరు చేసింది. పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను 80% రాయితీతో, అలాగే శనగ విత్తనాలను 25% నుంచి 50% వరకు రాయితీతో అందించనున్నారు. సాధారణ ఖరీఫ్ సాగు విస్తీర్ణంతో పోలిస్తే, ప్రకాశం జిల్లాలో 18%, మార్కాపురంలో 29%, అన్నమయ్యలో 29%, అనకాపల్లిలో 31%, చిత్తూరులో 33%, విశాఖపట్నం జిల్లాలో 44% భూమిలో మాత్రమే పంటలు వేశారు.

# పెద్దాసుపత్రుల్లో రోగుల కష్టాలు

**● రాత్రుల్లో చుక్కలు చూపిస్తున్న వైద్యులు**

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, హైదరాబాద్ బ్యూరో:**
హైదరాబాద్?కు చెందిన ఓ గర్భిణికి అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో వెంటనే నిలోఫర్? ఆస్పత్రికి తరలించారు. ఆమెను అత్యవసర విభాగంలో చేర్చారు. నొప్పులతో అవస్థలు పడుతోందని ఆమె కుటుంబ సభ్యులు వైద్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. అయితే సమాచారమిచ్చి 45 నిమిషాలు గడుస్తున్నా, వారి నుంచి ఎలాంటి స్పందనా లేదు. అక్కడి వైద్య సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఆమెను దగ్గరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది తక్షణం స్పందించింది. వెంటనే చికిత్స చేయడంతో ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. నిలోఫర్?లోనే ఉంచితే ఆమె పరిస్థితి ఏమయ్యేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

**రోగులకు చుక్కలు చూపిస్తున్న వైద్యులు**

ఈ తరహాలోనే తాజాగా నిమ్స్? ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో చేరిన ఓ రోగికి సేవలందించడంలో ఆలస్యం చేశారు. దీంతో రోగి కుటుంబసభ్యులు వైద్యులను నిలదీశారు. అది వివాదంగా మారి చివరకు పోలీసుల కేసు వరకు వెళ్లింది. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్?, పేట్లబుర్జు తరతర ఆస్పత్రుల్లో అర్ధరాత్రి సమయాల్లో వైద్య సేవలు అవసరమైతే రోగులకు చుక్కలు కనిపిస్తున్నాయి. సరైన సమయానికి చికిత్స అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. అందుబాటులో ఉండని సీనియర్? వైద్యులు సాధారణంగా రాత్రి వేళలో సీనియర్? వైద్యుల పర్యవేక్షణలో సేవలందించాల్సి ఉంటుంది. అయితే పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీనియర్లపైనే ఈ భారం పడుతోంది. సీనియర్? వైద్యులు జూనియర్లకు ఈ బాధ్యతలప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. ఈ కారణంగా పీజీలు, రెసిడెంట్? వైద్యులపై ఈ పని భారం పడుతోంది. ఈ నేపథ్యంలోనే కొన్నిసార్లు వైద్య సేవల్లో ఏమాత్రం జాప్యం జరిగినా రోగుల కుటుంబీకులు వైద్య సిబ్బందితో వాగ్వాదాలకు దిగుతున్నారు.ఈ నేపథ్యంలోనే పలు ఆస్పత్రుల్లో గొడవలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయాల్లో సీనియర్? వైద్యులు అందుబాటులో ఉంటే సర్దుబాటు చేసే వీలుంటుంది. ఓ వైపు పని ఒత్తిడి, మరోవైపు ఈ తరహా గొడవల కారణంగా విధుల్లో ఉన్న పీజీలు, రెసిడెంట్లు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రభావం రోగుల సేవలపై పడుతోంది.

**రాత్రిళ్లు పర్యవేక్షణ కరవు**

ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది, వైద్యుల విధులను పర్యవేక్షించాల్సిన ఆర్?ఎంవోలు చాలా మంది సమర్థంగా పని చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా రాత్రి పూట అత్యవసర విభాగాలు, వార్డ్?లలో పర్యటించి ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయి అనే సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆపై వారు తగిన చర్యలు తీసుకొని పరిష్కరిస్తారు. అయితే కొందరు రాత్రి 10 గంటలు దాటితే వారి గదుల నుంచి బయటకు రావడం లేదనే విమర్శలూ ఉన్నాయి.

# వారాంతపు సంత ప్రారంభం



**టీ మీడియా ,సెప్టెంబర్ 21,వెంకటాపూర్:**
మండల కేంద్రంలో వారాంతపు సంతను సోమవారం గ్రామ సర్పంచ్ మామిడిశెట్టి సుగుణరిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ.. ఇకపై ప్రతి సోమవారం మండల కేంద్రంలో వారాంతపు సంత నిర్వహించనున్నట్లు, మండలంలోని వివిధ గ్రామాల రైతులు తాము పండించిన కూరగాయలు, పంట ఉత్పత్తులను సంతకు తీసుకువచ్చి నేరుగా విక్రయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులు, కూరగాయలు తదితరాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కలుగుతుందని కాబట్టి రైతులు, వ్యాపారులు, ప్రజలు వారాంతపు సంతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రూ.6.40 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**టీ మీడియా ,సెప్టెంబర్ 21, అశ్వాపురం:**
అశ్వాపురం మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.6 లక్షల 40 వేల విలువైన చెక్కులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుసోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఆర్థిక సాయం అందడంపై లబ్ధిదారులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# తహసీల్దార్ కార్యాలయం తరలింపు



### ⏭ ఆలోచన విరమించుకోవాలి

**టీ మీడియా ,సెప్టెంబర్ 21,మరంపల్లి:**
మరంపల్లి మండల రెవెన్యూ కార్యాలయాన్ని ప్రస్తుత ప్రాంతం నుంచి ఇతర ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు..? మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, ఈ నిర్ణయం వల్ల మండల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని శాఖల సేవలు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉండేలా,సమీకృత మండల కార్యాలయాల భవన సముదాయం (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) పరిధిలోనే నూతన రెవెన్యూ కార్యాలయాన్ని నిర్మించాలని అధికారులను కోరారు.

# ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

**టీ మీడియా ,సెప్టెంబర్ 21,ఎర్రుపాలెం:**
పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ గౌరవ అదనపు సెషన్స్ జడ్జి, సత్తుపల్లి శ్రీ ఎం. శ్రీనివాస్ గారు తీర్పు వెలువరించారు.

2021లో ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 120/2021, సెషన్స్ కేసు నంబర్ 139/2022, లో నిందితుడైన పెండ్లి తిరుపతిరావు (51), రామాపురం గ్రామం, ఎర్రుపాలెం మండలంపై నేరం రుజువు కావడంతో గౌరవ న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించింది.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ జి. డేనియల్, కేసు దర్యాప్తు నిర్వహించిన ఎస్ఐ టి. ఉదయ్ కిరణ్, బ్రీఫింగ్ అధికారి ఎస్ఐ ఎం. రమేష్ కుమార్, కోర్టు డ్యూటీ నిర్వహించిన కానిస్టేబుల్ ఎం.బి. రుషి , లైజాన్ అధికారి కె. శ్రీకాంత్, ఎస్ఐలను పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# ఎర్రవల్లిలో భూముల సర్వే

### ⏭ విడతల వారీగా నోటీసులు?

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, సిద్దిపేట :**
జిల్లా కేసీఆర్ ఫామ్ హౌస్ పరిసరాల్లో రైతుల పొలాల వద్ద రెవెన్యూ అధికారుల సర్వే) కొనసాగుతోంది. సర్వే నంబర్ 325లో రైతుల వారీగా అధికారులు భూముల సర్వే చేస్తున్నారు. శనివారం నోటీసులు అందుకున్న రైతల పొలాల సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు అధికారులకు పొలాల హద్దులు చూపిస్తున్నారు. రైతుల సమక్షంలో భూముల హద్దులు, విస్తీర్ణాన్ని సర్వే సిబ్బంది పరిశీలిస్తున్నారు. నగర పర్యటనలను అన్వేషించండిభూమికి సంబంధించిన వివరాలను రైతుల వారీగా అధికారులు నమోదు చేస్తున్నారు. సర్వే నంబర్ 325లో(్రాబతీజవఎ చీబఎఎవతీ 325) వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు విడతల వారీగా నోటీసులు ఇస్తున్నారు. నాలుగు విడతల్లో సర్వే చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రైతుల సహకారంతో ప్రశాంత



వాతావరణంలో సర్వే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 30 రోజుల్లో భూముల సర్వే చేపట్టి రిపోర్టు ఇవ్వాలని రెవెన్యూ శాఖ ఆదేశించిన విషయం తెలిసిందే.

# అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

### ⏭ జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, ములుగు:**
ప్రజావాణి కార్యక్రమంలోఅర్జీదారులు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్, ఎం. సంపత్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవికుమార్ లతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 30 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత



గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా, ప్రజలకు జవాబుదారీ తనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో టీచర్లు, వైఎస్సార్సీపీ శ్రేణులు

### ⏭ శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, విజయవాడ :**
విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మెగా డీఎస్సీ–2025 స్పోర్ట్స్ కోటా టీచర్లు, వైఎస్సార్సీపీ నేతలు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై ఆ పార్టీ నాయకులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో వాటిని ఉపాధ్యాయులు ఖండిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో క్రీడలశాఖ మంత్రి రాంప్రసాద్?రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్? ఎండీ భరణికి వినతిపత్రాలు అందజేసేందుకు శాప్ కార్యాలయం వద్దకు స్పోర్ట్స్ కోటా టీచర్లు వచ్చారు.

అదే సమయంలో వైఎస్సార్సీపీ నేతలు కార్యాలయం బయట ధర్నాకు దిగారు. నిరసనకు పోలీసుల అనుమతి లేకపోయినా ఆ పార్టీ నాయకులు దేవినేని అవినాశ్?, జోగి రమేశ్? నేతృత్వంలో పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వైఎస్సార్సీపీ శ్రేణులు, మద్దతుదారులు కార్యాలయాన్ని ముట్టడించారు. డీఎస్సీలో అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. దీంతో ఇటు టీచర్లు, అటు ఆ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేశారు.

వైఎస్సార్సీపీ నేతల ఆరోపణలను స్పోర్ట్స్ కోటా టీచర్లు తీవ్రంగా ఖండించారు. “తమ సర్టిఫికెట్లు, మెడళ్లు నిజమైనవి. ఇకనైనా వాస్తవాలు తెలుసుకుని నిందలు మానుకోవాలి. ఆరోపణలు చేసే వారికి ఆధారాలు చూపిస్తాం” అని టీచర్లు నినాదాలు చేశారు. దీంతో మరింత రెచ్చిపోయిన వైఎస్సార్సీపీ శ్రేణులు “రా రా అంటూ మీసం మేలేస్తూ” కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. గేట్లు దూకి శాప్ కార్యాలయంలోకి ప్రవేశించేందుకు యత్నించారు.

ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ నేతలు, ఉపాధ్యాయులపై వాటర్ బాటిళ్లు విసిరారు. ఉపాధ్యాయులపై దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన టీడీపీ యువగళం టీమ్‌పై కూడా వారు




విరుచుపడ్డారు. దీంతో తమకు గాయాలయ్యాయని బాధితులు తెలిపారు. క్రమంగా ఈ వ్యవహారం రాజకీయ నిరసనకు, ఉపాధ్యాయుల ప్రతిస్పందనకు దారితీసింది. తమ వద్ద నియామకాలకు సంబంధించిన అక్రమాలపై ఆధారాలు ఉన్నాయని ఆ పార్టీ నాయకులు చెబుతుండగా, టీచర్లు తమ వద్దా ఒరిజినల్ సర్టిఫికెట్లు, మెడల్స్ ఉన్నాయని నినదించారు. తమ జోలికి వస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

దీంతో నిరసన మరింత ఉద్రిక్తతకు దారి తీసింది. ఉపాధ్యాయ మద్దతుదారులు, వైఎస్సార్సీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు చెందిన కొందరు బాహాబాహీకి దిగారు. వీరిని నిలువరించే క్రమంలో పోలీసులు, వైఎస్సార్సీపీ నేతల మధ్య తోపులాట జరిగింది. ఇలా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విజయవాడ ప్రధాన రహదారి బందరు రోడ్డుపై వైఎస్సార్సీపీ నాయకుల ఆందోళనతో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

మరోవైపు శాప్ కార్యాలయం ముందు రోడ్డుపై వైఎస్సార్సీపీ ధర్నాతో బెంజ్ సర్కిల్ వైపు వానాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు, భద్రతా దళాలు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. వైఎస్సార్సీపీ నాయకులను మద్ధతుదారులను అక్కడ నుంచి తరలించడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం టీచర్లు శాప్ ఎండీ భరణితో మాట్లాడి తమ సమస్యలను విన్నవించుకున్నారు. అల్లర్లను ఖండించిన మంత్రి మండిపల్లి శాప్ కార్యాలయం వద్ద వైఎస్సార్సీపీ నేతల అల్లర్లను మంత్రి మండిపల్లి రాంప్రసాద్?రెడ్డి ఖండించారు. దేవినేని అవినాశ్?, జోగి రమేశ్? రౌడీ మూకతో అల్లర్లకు పాల్పడ్డారని ఆరోపించారు. రౌడీ మూకతో రాళ్లు, కోడిగుడ్లతో అల్లర్లకు దిగారని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాన్ని చుట్టుముట్టి ఉపాధ్యాయులపై దాడికి యత్నించడం హేయమైన చర్యన్నారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్లపై దౌర్జన్యం చేయడం దుర్మార్గమని ఆయన తెలిపారు.

ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులు, టీచర్లను అవమానించడం సరికాదని మండిపల్లి రాంప్రసాద్?రెడ్డి హితవు పలికారు. టీచర్లపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అల్లర్లు, దాడులను సహించేది లేదని తేల్చి చెప్పారు. టీచర్లపై దాడులకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మండిపల్లి పేర్కొన్నారు.

# దొంగల బీభత్సం

**టీ మీడియా సెప్టెంబర్ 21 కూసుమంచి.**
నియోజకవర్గ కేంద్రం పాలేరు గ్రామంలో పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లో చొరబడి 7 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలను దొంగిలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాలేరు గ్రామానికి చెందిన తోట నాగమణి ఉదయం సుమారు 11 గంటల సమయంలో స్మార్ట్ రేషన్ కార్డు తెచ్చుకునేందుకు వెళ్ళింది. ఇంట్లో ఎవ్వరు లేనిది గమనించిన దొంగలు, మంచం అడ్డుగా పెట్టి తాళం పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాని పగులగొట్టి భద్రపరిచి ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు ( చిన్న, పెద్ద ఉంగరాలు, దిద్దులు బుట్టలు, జూకాలు, చైన్, ఇతర ఆభరణాలు ), 20 తులాల వెండి ఆభరణాలు ( పట్టీలు, గ్లాసులు, గిన్నెలు ) ఆభరణాలను అపహరించారు. సుమారు 12 గంటల సమయంలో ఇంటికి చేరుకున్న బాధితురాలు తోట నాగమణి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించింది. వెంటనే ఇంట్లో బీరువాలో దాచిపెట్టిన తమ బంగారు, వెండి వస్తువులను చూడగా కనిపించలేదు. బాధితురాలు సమాచారాన్ని స్థానికులు, పోలీసులకు తెలిపింది. వెంటనే కూసుమంచి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరును బట్టి పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. బాధితురాలు తోట నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు 1,20,00,000/-



⏭ **మంజూరు చేయించిన ఎంపీ**

**టీ మీడియా ,సెప్టెంబర్ 21 ,ఆత్మకూరు:**
నారాయణపేట జిల్లా నర్వ మండలం వెనకబడిన మండలాలలో ఒకటిగా గుర్తింపు పొందిన నర్వ మండల కేంద్రాన్ని (ఆస్పిరేషనల్ బ్లాక్) గతంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణ ఆధ్వర్యంలో సందర్శించి నర్వ మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాల సమస్యలపైన దృష్టి సారించరూ.అందులో భాగంగానే జేజమ్మ కృషితో, బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి సహకారంతో, బండి సంజయ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి నర్వ మండల కేంద్రానికి మొదటి విడతగా 8 నూతన అంగన్వాడీ భవనాలకు గాను రూ.1,20,00,000/- (ఒక కోటి ఇరవై లక్షలు) రూపాయలను మంజూరు చేయించిన డీకే అరుణమ్మ కి, బండి సంజయ్ కి బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి కి నర్వ మండలం తరపున హృదయ పూర్వక అభినందనలు తెలుపుతూ, ఇట్టి పనులను వీలయినంత త్వరలో ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించిన జేజమ్మ. ఇట్టి కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబెర్ శ్రీమతి లలితా వెంకట్ రెడ్డి , అజిత్ సింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీ విజయ్ రామ్ ,శ్రీ అశోక్ కుమార్ గౌడ్ ,అయ్యప్ప స్వామి పాల్గొన్నారు.

# అభయహస్తం హామీని అమలు చేయాలి

⏭ **వ్యవసాయ కార్మిక సంఘం నేతల డిమాండ్**

**టీ మీడియా,సెప్టెంబర్21,సింగరేణి(కారేపల్లి):**
ఎన్నికల సమయంలో ఎస్సీ,ఎస్టీ కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రకటించిన అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేసి,ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.సోమవారం కారేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్లో అంబేద్కర్ అభయ హస్తం కింద ఎస్సీ,ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తుచేశారు.అఎస్సీ,ఎస్టీ కుటుంబాల్లో అనేక మంది భూమి,ఇల్లు,విద్య,వైద్యం,స్వయం ఉపాధి వంటి అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని కృష్ణ,నాగేశ్వరరావు పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల ముందు ప్రకటించిన ఆర్థిక సహాయ పథకాన్ని త్వరగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక సాయం అందించాలని,లేనిపక్షంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన,పోరాట కార్యక్రమాలను చేపడతామని తాళ్లపల్లి కృష్ణ,కొండబోయిన నాగేశ్వరరావు హెచ్చరించారు.

# అంతా సుభిక్షంగా ఉండాలి



⏭ **శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి**

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, ఖమ్మం బ్యూరో**
ప్రజలంతా ఆయురారోగ్యాలతో, ఆనందంగా సుభిక్షంగా ఉండాలని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి ఆకాంక్షించారు. . వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలోని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ప్రధాన కార్యాలయంలో, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ గణపతి స్వామి విగ్రహం వద్ద సోమవారం పూజలు, కోలాట బృదంచే కోలాట కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తొలిసారి గణేష్ విగ్రహాన్ని తమ కార్యాలయంలో నెలకొల్పి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే కుంకుమార్చన, సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించడం జరిగిందాన్నారు. ఎల్ ని నో ప్రభావంతో దేశం, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు పడక రైతులలో, ప్రజలలో తీవ్ర ఇబ్బంది నెలకొందని పేర్కొన్నారు. వ్యవసాయం గాడినపడి పాడిపంటలతో రైతుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. వ్యవసాయ రంగం మంచిగా ఉంటే అన్ని రంగాలు పరిడమిల్లుతాయని తద్వారా అందరూ ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తారాన్నారు. అందరి జీవితాలలోని విఘ్నాలు తొలగిపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ పార్ట్నర్ రేణుక రవి, కార్యాలయపు ఇన్చార్జ్ పోగుల రవికుమార్, ఉత్సవ కమిటీ బాధ్యులు శ్రీనివాసరాజు,సాయికిరణ్, కృష్ణ చౌదరి, వి నరేష్, సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్లు షేక్ తాజుద్దీన్, కాసాని శ్రీశైలం, గాలి నారాయణ, తోట వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ డైరెక్టర్లు, మార్కెటింగ్ సిబ్బంది కార్యాలయపు సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

# నకిలీ మిరప విత్తనాలతో నష్టం

**టీ మీడియా ,సెప్టెంబర్ 21,ఏన్కూరు :**
నకిలీ మిరప విత్తనాలు విక్రయించి రూ.25 లక్షల నష్టం కలిగించిన దుకాణంపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారికి రైతులు వినతిపత్రం ఇచ్చారునకిలీ మిరప విత్తనాలు విక్రయించడంతో తీవ్రంగా నష్టపోయామని ఆరోపిస్తూ సుజాతనగర్ మండలం మాలబంజర గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు, రైతు సంఘం నాయకులు ఖమ్మం జిల్లా.. ఏన్కూరు మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. రైతుల వివరాల ప్రకారం.. ఏన్కూరు మెయిన్‌రోడ్డులోని జై జవాన్ జై కిసాన్ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో ఏపీ–243 రకం మిరప విత్తనాలని చెప్పి 'బంజారా పల్స్' పేరుతో ప్యాకెట్లలో విత్తనాలు విక్రయించారని ఆరోపించారు. మాలబంజర గ్రామపంచాయతీ పరిధికి చెందిన సుమారు 20 నుంచి 25 మంది రైతులు విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేసినట్లు తెలిపారు. అయితే పంటలో ఆశించిన స్థాయిలో ఎదుగుదల లేకపోవడంతో పాటు పూత, కాయ రాకపోవడం, మిరప మొక్కలకు తీవ్రంగా ముడత సమస్య ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. దీంతో ఒక్కో ఎకరాకు సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. మొత్తం రైతులకు సుమారు రూ.25 లక్షల మేర నష్టం జరిగిందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. నకిలీ విత్తనాల విక్రయంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, విత్తనాలను పరీక్షించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. సంబంధిత దుకాణం లైసెన్స్‌ను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే



చర్యలు తీసుకోవడంతో పాటు, నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ రైతు సంఘం కార్యదర్శి బచ్చలకూర శ్రీనివాసరావు, రైతులు నల్లగోపు పుల్లయ్య, రాందాసు, లచ్చిరాం, భీమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మహిళలకు వర్క్ షాప్



**టీ.మీడియా,సెప్టెంబర్21,చింతూరు:**
చింతూరు మండలం చింతూరు గ్రామంలో శాపిడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఎస్.కె అహ్మద్ అలీ ఆధ్వర్యంలో మహిళా నాయకత్వం అభివృద్ధి వర్క్ షాప్ నిర్వహించారు. 8 గ్రామాల నుండి మహిళలు 125 మంది పాల్గొన్నారు. సందర్భంగా సి ఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ గిరిజన మహిళలు అనేక సమస్యలతో గురి అవుతున్నారని, అభివృద్ధి వెనకబడి ఉన్నారని, ఆదివాసి బిడ్డలను మెరుగుపరచాలని ఉద్దేశ్యంతో ఈ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆదివాసి మహిళలకు సంస్థ ఆధ్వర్యంలో కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ దొర, ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ సాయి చందు,గవర్నమెంట్ డాక్టర్ గైనకాలజిస్ట్ శశికళ, సాపిడి సంస్థ ఆర్గనైజర్స్ బంగారు జానకి సోడి లక్ష్మి తురం నాగరాజు అంజలి కీర్తి అశ్విని పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమాలకు ట్రస్ట్ చేయూత




**టీ.మీడియా,సెప్టెంబర్21,చింతూరు:**
వినాయక చవితి పర్వదినాలు అంటే పూజలు, ఉత్సవాలే కాదు... భక్తులతో సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఉంటుంది. అలాంటి సేవా స్ఫూర్తితో చింతూరు ఏజెన్సీలో వినాయక చవితి సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ తనవంతు చేయూత ను అందించారు.ట్రస్ట్ చైర్మన్, ఆయుర్వేద వైద్యులు మొహమ్మద్ జమాల్ ఖాన్, ట్రస్ట్ సెక్రటరీ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించే నిర్వాహకులకు బియ్యం పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అబ్రారులక్,సత్యందర్,పవన్ పసుపులేటి సల్మాన్ రాజు,ఒబిలీనేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంట్లో చోటు లేక..



⏭ **మృతదేహం నేరుగా స్మశానానికే**

**టీ మీడియా ,సెప్టెంబర్ 20, హైదరాబాద్ బ్యూరో ;**
బతికున్నప్పుడే సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి.. తల్లి మరణించిన తర్వాత కూడా కష్టాలు తప్పలేదు. కనీసం చివరి చూపు చూసేందుకు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లే పరిస్థితి లేకపోవడంతో.. ఆస్పత్రి నుంచి నేరుగా స్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది. ఈ విషాద ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం దర్పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. దర్పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ (65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమెను మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి మరింత విషమించడంతో లక్ష్మీ మృతి చెందారు. సాధారణంగా ఎవరైనా మృతి చెందితే.. మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చి బంధువులు, గ్రామస్తులు చివరి చూపు చూసిన అనంతరం అంత్యక్రియలకు తరలిస్తారు. అయితే లక్ష్మీ కుటుంబానికి ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. ఆ కుటుంబం కొన్నేళ్లుగా సొంత ఇల్లు లేక చిన్న డేరా వేసుకుని జీవిస్తోంది. వారు నివసిస్తున్న ప్రదేశంలో మృతదేహాన్ని ఉంచేందుకు సరైన స్థలం లేకపోవడంతో.. ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని నేరుగా గ్రామంలోని స్మశానవాటికకు తరలించారు. అక్కడే బంధువులు, కుటుంబ సభ్యులు లక్ష్మీకి తుది నివాళులు అర్పించి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిని కోల్పోయిన బాధ ఒకవైపు.. కనీసం ఆమె మృతదేహాన్ని కూడా ఇంటికి తీసుకెళ్లలేకపోయామన్న ఆవేదన మరోవైపు కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేసింది.

సొంత గూడు లేకపోవడం ఒక కుటుంబాన్ని ఎలాంటి దుస్థితికి గురిచేస్తుందో ఈ ఘటన మరోసారి కళ్లకు కట్టినట్లు చూపించింది. పేద కుటుంబాలకు ఇల్లు అనేది కేవలం నివాసానికి మాత్రమే పరిమితం కాదని.. జీవితంలోని చివరి ఘడియల్లోనూ ఆత్మీయులకు గౌరవంగా వీడ్కోలు పలికేందుకు అవసరమైన కనీస ఆశ్రయమని ఈ ఘటన చర్చకు తెచ్చింది. దర్పల్లి ఘటన నేపథ్యంలో సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న ఈ కుటుంబ పరిస్థితిపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కుటుంబానికి ప్రభుత్వ గృహ పథకాల అర్హత ఉంటే.. నిబంధనల ప్రకారం సొంత ఇంటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక తల్లికి చివరి వీడ్కోలు పలికే సమయంలో కూడా.. ఇంట్లో చోటు లేని పరిస్థితి రావడం దర్పల్లి గ్రామంలో విషాదాన్ని నింపింది.

# సర్పంచ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**● అండగా ఉంటామని భరోసా**

**టీ మీడియా ,సెప్టెంబర్ 21,జూలూరుపాడు:**
కారు డోర్ లాక్ అయి ప్రాణాలు కోల్పోయిన వినోబా నగర్ గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్ కుమార్తె, చిన్నారి 'తన్వితశ్రీ' మృతి అత్యంత బాధాకరమని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జూలూరుపాడు మండల పరిధిలోని వినోబా నగర్ గ్రామంలోని సర్పంచ్ నవీన్ నివాసానికి వెళ్లిన ఆమె బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, చిన్నారి అకాల మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ?ఈ సందర్భంగా కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి ఊహించని విషాద సమయంలో కన్నవారిని మాటలతో ఓదార్చడం ఎవరికైనా కష్టమే అన్నారు.పసిబిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రుల గర్భశోకం వర్ణనాతీతం అని, ఈ తీరని శోకాన్ని తట్టుకునే గుండె ధైర్యాన్ని భగవంతుడు ఆ కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటా అని భరోసా ఇచ్చారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందిన అన్నారుపాడు సర్పంచ్ భూక్యా ప్రసాదును వారి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగేశ్, గంగావత్ గోరియా, బానోత్ రవి, గంగావత్ లింగ, భూక్యా చందు, మాలోత్ నాగేశ్వరరావు, గంగావత్ రవి, గంగావత్ నరేంద్ర, గంగావత్ ప్రసాద్, బానోత్ రామ, బానోత్ పంతులు, బానోత్ నాన్య పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ



**● ప్రొసిడింగ్ అందజేసిన మున్సిపల్ చైర్మన్**

**టీ మీడియా ,సెప్టెంబర్ 21, పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డుకు చెందిన లబ్ధిదారులు మధుగాని భాగ్యమ్మ భర్త నారాయణ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు అనంతరం ఇంటి నిర్మాణానికి సంబంధించిన అధికారిక ప్రోసీడింగ్ పత్రాన్ని లబ్ధిదారులకు అందజేశారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు మంజూరైన గృహ నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు పట్టణంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు
తమలాంటి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆసరాగా నిలిచినందుకు లబ్ధిదారులు మధుగాని భాగ్యమ్మ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు తమ కల నెరవేర్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి స్థానిక ఎమ్మెల్యేమేఘారెడ్డికి చైర్మెన్ కౌన్సిలర్ కు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మంగరాయి మన్యం వార్డు ఆఫీసర్ ధర్మతేజ లు పాల్గొన్నారు.

# జూరాల ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత



**టీ మీడియా, సెప్టెంబర్ 21, ఆత్మకూరు :**
వనపర్తి జిల్లా ఆత్మకూరు అమరచింత మండలనికి చెందిన రైతులు గత మూడు రోజులుగా జూరాల ప్రాజెక్టు చేయాలని ప్రాజెక్టు వద్ద ధర్నాలు చేశారు. ఆత్మకూర్ అమరచింత మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి శ్రీహరికి చెప్పి నీది విడిపిస్తామని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. చివరికి దేవరకద్ర నియోజకవర్గం వచ్చిన మంత్రి వాకిటి శ్రీహరి ఓ సమావేశంలో మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు కుడి ఎడమలకు నీరు విడిచే పరిస్థితి ఇప్పుడు లేదని, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఈ నీరు ఇప్పటినుండి వచ్చే సంవత్సరం జూన్ వరకు జిల్లా తాగునీటి అవసరాల కొరకు కావాలని, ప్రస్తుతం మేము విడిచే పరిస్థితి లేదని చెప్పారు. దీంతో ఆత్మకూరు అమర్చిన మండలాలకు చెందిన రైతులు ఉదయం జూరాల ప్రాజెక్టు అభ్యర్థి చేరుకొని ధర్నాకు దిగారు. ప్రాజెక్టు వద్ద ఇదివరకే చేరుకున్న పోలీసు బలగాలు రైతులందరికీ తరిమికొట్టారు. దీంతో ఆగ్రహించిన రైతులు రోడ్లపై ముళ్లకంచెలు స్తంభాలు వేసి పోలీసు వాహనాలకు ఆటంకం కలిగించారు. పోలీసులతోపాటు స్పెషల్ ఫోర్స్ వచ్చి రైతులను చదరగొట్టారు. జూరాల ఆయకట్టు కింద దాదాపు 50 వేల ఎకరాల కంటే ఎక్కువగా పంటలు చివరి దశలో ఉన్నాయని, నీరు లేకపోతే ప్రతి రైతు కు లక్షల రూపాయల నష్టం వస్తుందని రైతులు వాపోయారు. ఆత్మకూర్ మరచింత నాయకులను తెల్లవారుజామునే ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో ఉంచారు.

# ఫామ్‌హౌస్ పరిశీలించిన టీకాంగ్ నేతలు



**● ఇనామ్ భూములు పేదలకు పంచాలని డిమాండ్**

**టీ మీడియా ,సెప్టెంబర్ 20, రంగారెడ్డి :**
బీఆర్ఎస్ నేతలకు చెందినవని ఆరోపిస్తూ, ఆ భూముల నిజాలు నిగ్గుతేల్చేందుకు కాంగ్రెస్? నేతలు గత మూడు రోజులుగా బృందంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా నాలుగోరోజు హస్తం పార్టీ ప్రజాప్రతినిధుల నిజనిర్ధారణ బృందం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూర్ చేరుకున్నారు. నాలుగోరోజు క్షేత్రస్థాయి భూముల పరిశీలనలో భాగంగా ఎంపీ చామల కిరణ్? కుమార్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పర్యటించారు.
జగదీశ్‌రెడ్డి చెరువు కాల్వలు కాజేశారు
గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు, భూ కబ్జాలు జరిగాయని అవి ప్రజలకు చూపించేందుకే వెళ్తున్నామని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బృందం వెల్లడించింది. ప్రజాభవన్ నుంచి బయలుదేరిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులు బీఆర్ఎస్? నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజా భవన్ నుంచి బస్సులో బయలుదేరారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి సంబంధించిన భూములను ప్రజలకు చూపిస్తామని తెలిపారు. మద్దూర్‌లో 50 ఎకరాల్లో జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ ఉందని, 50 ఎకరాల్లో ఇనామ్ భూములు ఉన్నాయని కాంగ్రెస్ నేతల ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగదీశ్‌రెడ్డి చెరువు కాల్వలు కాజేశారని వెల్లడించారు. జగదీష్ రెడ్డి 50 ఎకరాల భూమి ఫామ్ హౌస్ మ్యాప్ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బృందం విడుదల చేసింది. ఇందులోనే 11 ఎకరాల ఇనామ్ భూములు ఉన్నట్లు ఆరోపించారు. ఇవాళ్టి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల నిజనిర్ధారణ కమిటీ పర్యటన ముగిసింది.మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్న 300 ఎకరాల అసైన్డ్ భూమిని పేదలకు ఎందుకు పంచి ఇవ్వలేదని చామల కిరణ్? కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఉన్నది పేదలకు పంచి ఇవ్వాలని గతంలో నాయకులు ఆలోచించేవారని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మాత్రం దోచుకుంటున్నారని విమర్శించారు.

# కాంట్రాక్టర్ ల అక్రమ వసూళ్లు




**● సి పి ఎం మండల కమిటీ**

**టీ మీడియా, సెప్టెంబర్ 21 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం లోని వారంతపు సంతలో అక్రమ వసూళ్లను ఆపాలని సి పి ఎం పెబ్బేరు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణి లో ఫిర్యాదు చేయడం జరిగింది సంత కాంట్రాక్టర్ లు పురపాలక టెండరు పిలవకుండానే డబ్బులు వసూలు చేస్తున్నారు ప్రతి శనివారం సంతలో వ్యాపారం చేసుకునే ప్రజల నుండి దాదాపు 12 లక్షల రూపాయల నుండి 14 లక్షల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు సంతలో వేల మంది కుటుంబాలు తమ జీవనోపాధి కోసం చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని జీవిస్తున్నారు కూరగాయలు హోటల్స్ తాళ్లు కోళ్లు మేకలు పొట్టేలు బర్రెలు ఎద్దులు వివిధ రకాల వ్యాపారాలు చేసుకునే పేద మధ్య తరగతికి చెందిన ప్రజలు జీవిస్తున్నారు అలాంటివారితో మేమే సంత కాంట్రాక్టర్లమని పురపాలక సంఘం పేరు వున్న రసీదులతో అక్రమంగా తైబజారు చిట్టీ వసూలు చేస్తున్నారు తేదీ01-04-2024 నుండి2026 నేటి వరకు కాంట్రాక్టర్లు వసూలు చేసిన డబ్బులు దాదాపు 17 కోట్ల 42 లక్షల రూపాయలు ఇందులో పురపాలక సంఘానికి రావలసిన నిధులు 8 కోట్ల 71 లక్షలు రూపాయలు కానీ ఒక్క రూపాయి కూడా పురపాలక సంఘానికి చెల్లించలేదు ఇట్టి డబ్బులను సంతలో కాంట్రాక్టర్లు వ్యాపారం చేసుకునె ప్రజలతో పీడించి వసూలు చేశారు వసూలు చేసిన డబ్బులు మొత్తం కాంట్రాక్టర్ లే స్వాహా చేస్తున్నారు ఇంత జరుగుతున్న పురపాలక సంఘం పాలకవర్గంగాని పురపాలక సంఘ అధికారులు గానీ అక్రమంగా డబ్బు వసూలు చేసిన కాంట్రాక్టర్ లపై చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉంది కావున పురపాలక సంఘం పేరుతో అనుమతి లేకుండానే వసూలు చేసిన డబ్బులు మొత్తాన్ని రికవరీ చేయాలని అక్రమంగా డబ్బు వసూలు చేసిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోగలరని పురపాలక సంఘం అనుమతి లేని అక్రమ డబ్బు వసూళ్లపై విచారణ జరిపి వెంటనే నిలిపివేయాలని కోరుతున్నాము ఈ కార్యక్రమంలో సిపిఎం పెబ్బేరు మండల కార్యదర్శి జి బాలయ్య సిపిఎం నాయకులు ఆర్ దేవన్న ఎం వెంకటస్వామి పి ఉషన్న ఆర్ భాస్కర్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నీళ్లు అడిగితే...అక్రమ అరెస్టులా ..?




**టి మిడియా, సెప్టెంబర్ 21, ఆత్మకూరు:**
జూరాల ఆయకట్టు రైతులకు నీళ్లు వదలాలని టిఆర్ఎస్ పార్టీ ధర్నా కు పిలుపు నివ్వాడంతో ఆత్మకూరు, అమరచింత టిఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని జూరాల ఆయకట్టుకు సాగునీరు అందించే వరకు రైతుల పక్షాన పోరాడుతూనే ఉంటాం టిఆర్ఎస్ నాయకులు అన్నారు.రైతులపై ఈ కాంగ్రెస్ ప్రభుత్వనికి ఏమైనా ప్రేమ చిత్తశుద్ధి ఉంటే సాగుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలనీ,ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి అరెస్టులపై ఉన్న శ్రద్ధ రైతులకు నీళ్లు ఇచ్చే దాని మీద పెట్టాలనిఇలా ప్రశ్నించే వారిని అంత అరెస్టు చేసుకుంటా పోతమంటే చూస్తూ ఊరుకునే లేదని సమస్యను ఇంకా ఉధృతం చేస్తాం అని తెలియజేశారు. మీరు ఎన్ని అరెస్టు చేసిన ప్రతి సమస్యపై రైతుల పక్షాన ,ప్రజల పక్షాన ప్రశ్నిస్తూ,పోరాడుతూ ఉంటామని మండిపడిన ఆత్మకూరు, అమరచింత పార్టీ నాయకులు అన్నారు.

# అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత



**● అంగన్‌వాడీ టీచర్లకు నేరాలపై శిక్షణ**

**టీ మీడియా,సెప్టెంబర్21,సింగరేణి(కారేపల్లి):**
మహిళలు,బాలికల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఐసీడీఎస్ కామేపల్లి ప్రాజెక్టు సీడీపీవో ఉమ,ప్రజ్వల జిల్లా కోఆర్డినేటర్ సురేష్‌కుమార్,సర్పంచ్ దండు ప్రవీణ్ పిలుపునిచ్చారు.మానవ అక్రమ రవాణా తీవ్రమైన వ్యవస్థీకృత నేరమని,మహిళలు,బాలికలు దాని బారిన పడకుండా సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ,ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లకు మానవ అక్రమ రవాణా,సైబర్ ట్రాఫికింగ్,అక్రమ రవాణా నిరోధక చట్టాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల స్వరూపం కూడా మారుతోందని,ముఖ్యంగా మహిళలు,బాలికలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైబర్ ఆర్థిక మోసాలకు గురైన సందర్భాల్లో 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.మహిళలు, బాలికల రక్షణ,అక్రమ రవాణా బాధితుల సహాయం,పునరావాసం లక్ష్యంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోందని తెలిపారు.పద్మశ్రీ డాక్టర్ సునీతా కృష్ణన్ ఆధ్వర్యంలో వేలాది మంది మహిళలు,బాలికలు,చిన్నారులకు రక్షణ,పునరావాస సహాయం అందించినట్లు సంస్థ ప్రతినిధులు వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్లు భూపాల్,నాగరాణి,ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యశీల,దేవేంద్ర,కృష్ణకుమారి,అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.